# సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 28 । జనవరి । 2024






**బీఆర్ఎస్ పాలనలో..**

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి సాధించిందని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. 8లో▸



**శాస్త్రీయ దృక్పథం అవసరం**

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి అన్నారు. 8లో▸



**జాగ్రత్తగా నడపండి..**

ఇష్టానుసారంగా వాహ నాలు నడిపి జీవితాలను ఆగం చేసుకోవద్దని పద్మశ్రీ అవార్డు గ్రహీత మొగిలయ్య విజ్ఞప్తి చేశారు. 8లో▸

## న్యూస్‌రీల్

### ప్రజల అవసరాల మేరకు బడ్జెట్ ఉండాలి

అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

షాద్‌నగర్: మున్సిపాలిటీలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అంచనా బడ్జెట్‌ను రూపొందించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌పై శనివారం మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. మిషన్ భగీరథ అధికారులతో సమన్వయంతో పని చేసి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. తడిపొడి చెత్త వేరు చేసి ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమం నిర్మాణాత్మకంగా వంద శాతం చేపట్టాలన్నారు. పట్టణంలో ఆస్తి పన్నులను సకాలంలో వంద శాతం పూర్తి చేయాలని, పాత బకాయిలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి పనులు, ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కమిషనర్ వెంకన్న, ఏఈ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన పెరగాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి

ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం న్యాయస్థానం సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదే వి అన్నారు. వినోబానగర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏకాగ్రతతో చదివితేనే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు. ఇష్టపడి విద్యను అభ్యసిస్తే భవిష్యత్తుకు బంగారుబాట పడుతుందన్నారు. బాలికలు ఆపద వచ్చినప్పుడు ఎదుర్కోవడానికి ధైర్యంగా ఉండాలన్నారు. చిన్నచిన్న విషయాలకు గొడవపడి కోర్టు చుట్టూ తిరిగి డబ్బు, సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

### ఎరువుల విక్రయంపై ప్రత్యేక దృష్టి

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

షాద్‌నగర్: రైతులకు పారదర్శకంగా ఎరువులను విక్రయించేందుకు వ్యవసాయశాఖ కొత్త యాప్‌ను రూపొందించిందని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. పట్టణంలోని ఫర్టిలైజర్, ఎరువుల దుకాణాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఉండే నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతులకు రాయితీలపై ఎరువులను అందజేస్తోందని తెలిపారు. రైతులకు విక్రయించే ఎరువులు పక్కదారి పట్టకుండా, వ్యాపారులు కొరత సృష్టించకుండా ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రతి డీలర్ విధిగా ఆధార్‌కార్డు ఆధారిత వేలిముద్రతో విక్రయించాలని సూచించారు. ఎరువులు కొనుగోలు చేసే రైతులకు విధిగా రసీదులు ఇవ్వాలన్నారు. కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, దుకాణాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాల్లో చూపించిన నిల్వలు, భౌతిక నిల్వలకు మధ్య వ్యత్యాసాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు విక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి నిషాంత్‌కుమార్ ఉన్నారు.

# ప్రజలకు అభివృద్ధికి దూరం!




**క్యాంపుల పేరుతో చక్కర్లు**

- మూడు వారాలుగా ఫోన్లు స్విచ్ఛాఫ్
- స్పందించని కార్పొరేటర్లు, కౌన్సిలర్లు
- కుంటుపడిన అభివృద్ధి
- 'ఆదిబట్ల'కు నోటీసులు జారీ చేసిన కలెక్టర్
- ఇబ్రహీంపట్నం, బండ్లగూడ జాగీర్‌పై తర్జనభర్జన

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రజల చేత, ప్రజల కోసం ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ఆ తర్వాత ప్రజాసేవను విస్మరిస్తున్నారు. రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తున్నారు. వారిని నమ్మి ఓట్లు వేసిన ఓటర్లు తీరా వారిపని తీరును చూసి పెదవి విరుస్తున్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలోని ప్రజలు సహజంగా తమ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ, మురుగు కాల్వల శుద్ధి, తాగునీటి సరఫరా, పార్కులు, వీధిలైట్ల నిర్వహణ, ఇతర సమ స్యల పరిష్కారం కోసం స్థానిక కార్పొరేటర్లు, కౌన్సిలర్లను ఆశ్రయిస్తుంటారు. అధికారులు, ప్రజలకు మధ్య వారధిలా ఉంటూ ప్రజలకు సేవ చేయాల్సిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అవిశ్వాసాల పేరుతో 15 నుంచి 20 రోజులుగా అజ్ఞాతంలోనే ఉండిపోయారు. సమస్యలు చెప్పుకొనేందుకు స్థానికులెవరైనా ప్రయత్నిస్తే..కనీసం అందుబాటులో ఉండడం లేదు. చివరికి ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్ చేసేశారు. కార్పొరేషన్, మున్సిపాలిటీలోని మెజార్టీ సభ్యులు మున్సిపాలిటీకి దూరంగా ఉండటంతో కీలక నిర్ణయాలు కూడా తీసుకోలేని పరిస్థితి. ఫలితంగా ఆయా అభివృద్ధి పనులు నిలిచిపోయాయి.

**ఇబ్రహీంపట్నంలో ఇలా..**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో బీజేపీకి ఇద్దరు, కాంగ్రెస్‌కు ఆరుగురు, బీఆర్ఎస్‌కు 16 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో బీఆర్ఎస్ అభ్యర్థి కప్పరి స్రవంతిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. ప్రస్తుతం 17 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ మేరకు జనవరి 8న అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌కు నోటీసులు ఇచ్చి, ఆ వెంటనే 15 మంది (వీరిలో ఆరుగురు మహిళా కౌన్సిలర్ల తరఫున వారి భర్తలు) క్యాంపునకు వెళ్లిపోయారు. కలెక్టర్‌కు నోటీసులిచ్చి 20 రోజులైంది. ఆదిబట్ల మున్సిపాలిటీకి నోటీసులిచ్చిన కలెక్టర్ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ విషయంలో ఇప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. ఒకవేళ చైర్‌పర్సన్‌ను మార్చాలని మెజార్టీ సభ్యులు భావిస్తే స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండి, తొలగించుకోవచ్చు. పట్నం కౌన్సిలర్లు మాత్రం తమకు ఓటు వేసి గెలిపించిన ఓటర్లను, వారి సమస్యలను గాలికొదిలేసి రోజుల తరబడి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ప్రజలకు దూరంగా ఉండిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**బండ్లగూడలో బాధలు**

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌పై 16 మంది (బీజేపీ నుంచి ఒకరు, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి 13 మంది) కార్పొరేటర్లు తిరుగుబావుటా ఎగరేశారు. ఇక్కడ మొత్తం 22 కార్పొరేటర్లు ఉండగా, వీరిలో ఒకరు మృతి చెందారు. జనవరి 12న కలెక్టర్ శశాంకను కలిసి నోటీసులు అందజేశారు. అదే రోజు 16 మంది క్యాంపునకు వెళ్లారు. ఆంధ్రప్రదేశ్, గోవా, బెంగళూరు మీదుగా ప్రస్తుతం లక్నవరానికి చేరుకున్నారు. ఆరునెలల కోసం అవిశ్వాస తీర్మానం పెట్టడం సరైన నిర్ణయం కాదని, క్యాంప్ నుంచి తిరిగి రావాల్సిందిగా స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ వీరిపై ఒత్తిడి తెస్తున్నారు. అయినా వారు పట్టించుకోవడం లేదు. నోటీసులిచ్చి 16 రోజులవుతున్నా ఇప్పటికీ అవిశ్వాస తీర్మానానికి సమావేశ తేదీని నిర్ణయించలేదు. మెజార్టీ కార్పొరేటర్లు క్యాంపుల్లో ఉండటం, రోజుల తరబడి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. డివిజన్లలో పొంగిపొర్లుతున్న మురుగునీరు, తాగునీటి సమస్య, గుంతలు తేలిన రోడ్లు, వెలగని వీధిలైట్లు, వీధి కుక్కల బెడదతో ఇబ్బంది పడుతున్నారు. సమస్యలను చెప్పుకొనేందుకు కార్పొరేటర్లు అందుబాటులో లేకపోవడంపై వారంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**ఆదిబట్లలో అలా..**

ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఆర్తిక (కాంగ్రెస్)పై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు జనవరి 9న అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. మున్సిపాలిటీలో 15 మంది అభ్యర్థులు ఉండగా, వీరిలో 13 మంది నోటీసులపై సంతకాలు పెట్టారు. ఆ తర్వాత 12 మంది క్యాంపునకు వెళ్లారు. ఇటీవలే వారు తిరిగి ఇంటికి చేరుకున్నారు. మూడు రోజుల క్రితం మళ్లీ క్యాంపునకు వెళ్లారు. వీరంతా 18 రోజులుగా ప్రజలకు దూరంగా ఉంటున్నారు. కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసులపై కలెక్టర్ స్పందించారు. ఫిబ్రవరి 9న సమావేశం నిర్వహించనున్నట్లు మూడు రోజుల క్రితం మున్సిపాలిటీ సహా సభ్యులందరికీ సమాచారం అందజేశారు. కౌన్సిలర్ల తీరుపై స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా సీరియస్ అయ్యారు. వెంటనే క్యాంప్‌ను వీడి రావాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అయినా కౌన్సిలర్లు లెక్క చేయలేదు.



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

# గెలిచి తీరాల్సిందే

**బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మూసీలో వేసినట్టే..**

- హామీలు నెరవేర్చే దిశగా కాంగ్రెస్ పనిచేయడం లేదు
- కేంద్రంలో మళ్లీ వచ్చేది మోదీ ప్రభుత్వమే
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి
- చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'కేంద్రంలో మళ్లీ వచ్చేది మోదీ ప్రభుత్వమే.. తెలంగాణలోనూ బీజేపీ గాలి కొనసాగుతోంది.. లోక్‌సభఎన్నికల కోసం బూత్ స్థాయి నుంచే పక్కా ప్రణాళికతో పనిచేసి మెజార్టీ సీట్లు సాధించేందుకు కృషి చేయాలి.. ఎట్టి పరిస్థితుల్లోనూ చేవెళ్ల లోక్‌సభా స్థానాన్ని గెలిచి తీరాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం నిర్వహిం చారు. ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌రెండు కుటుంబ పార్టీల డీఎన్ఏ ఒక్కటే అన్నారు. బీఆర్ఎస్‌అవినీతిపై చర్యలు తీసుకునేందుకు కాంగ్రెస్ సర్కారు వెనకడుగు వేస్తుండటాన్ని చూస్తే.. ఈ రెండు పార్టీలు ఒక్కటేనన్న భావన కలుగుతోందన్నారు. కాళేశ్వరంపై దర్యాప్తునకు తాము సిద్ధమే అని సీబీఐ చెబుతున్నా.. విచారణకు ఆదేశించడం లేదని, బీఆర్ఎస్‌అవినీతిని ఆ పార్టీ కప్పిపుచ్చాలని చూస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మూసీలో వేసినట్టేనని.. ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా కాంగ్రెస్‌పనిచేయడం లేదని విమర్శించారు.

**కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి..**

తొమ్మిదిన్నరేళ్లలో లక్షల కోట్ల నిధులు మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిందని గుర్తు చేశారు. జాతీయ రహదారులు, రైల్వేలు, ఇతర ప్రాజెక్టులు సహా ట్రైబల్‌వర్సిటీ, పసుపుబోర్డు, వందే భారత్ రైళ్లు, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ ఇలా.. పెద్ద ఎత్తున తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. బూత్‌ల వారీగా లక్ష్యం నిర్దేశించుకోవాలని, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని సూచించారు. రైతులు, రైతు కూలీలు, యువత, మహిళలను చైతన్య పర్చాలన్నారు. ప్రతి ఒక్కరూ గెలుపు కోసం సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమావేశానికి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రంగారెడ్డి అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, సీనియర్ నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖతో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

# కాంగ్రెస్ గూటికి 'తీగల'?

- సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి
- జెడ్పీ చైర్‌పర్సన్ దంపతులతో కలిసి మంత్రి కొండా సురేఖతో భేటీ
- త్వరలో హస్తం పార్టీలో చేరతారని జోరుగా ప్రచారం

మహేశ్వరం: మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి కలిశారు. అనంతరం జెడ్పీచైర్‌పర్సన్ దంపతులతో కలిసి వెళ్లి మంత్రి కొండా సురేఖతో భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో వారు త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారనే ప్రచారం జోరందుకుంది. తీగల కృష్ణారెడ్డి 2014లో టీడీపీ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొంది అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థి సబితారెడ్డిపై పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం ఇద్దరూ ఒకే పార్టీలో కొనసాగారు. ఆయన కోడలు అనితారెడ్డి బీఆర్ఎస్ పార్టీ నుంచి మహేశ్వరం జెడ్పీటీసీగా గెలుపొంది జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తీగల కృష్ణారెడ్డి అలకబూనడం.. స్వయంగా కేటీఆర్ రంగంలోకి దిగి బుజ్జగించడం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీలోకి రావాలని రేవంత్‌రెడ్డి పలుమార్లు ఆహ్వానించగా సున్నితంగా తిరస్కరించారు. ఈ క్రమంలో ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక సీట్లు గెలుపొంది అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరాలని ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది.

**చర్చనీయాంశంగా తాజా భేటీ**

తాజాగా శనివారం మహేశ్వరంలో మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరుకాగా, మహేశ్వరం జెడ్పీటీసీ సభ్యురాలు, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి దుమ్మాకొట్టి కాంగ్రెస్ నేతలను కలవడానికి వెళ్లడం గమనార్హం. తీగల అనితారెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరతారని కొంతకాలంగా నియోజకవర్గంలో చర్చ సాగుతోంది. ఈ కలయికతో దానికి మరింత బలం చేకూరినట్లయింది. ఇటీవల జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి జన్మదిన వేడుకలను ఘట్టుపల్లిలోని ఓ రిసార్ట్‌లో భారీ ఎత్తున నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లాలో ఉన్న జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు తీగల అనుచరులు, బీఆర్ఎస్ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ మారుతున్నారనే సంకేతం ముఖ్య అనుచరులకు ఇచ్చినట్లు తెలిసింది. ఆమెతో కాంగ్రెస్‌లోకి రావడానికి మండలంలోని పలువురు బీఆర్ఎస్ నేతలు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం.

# ప్రభుత్వ భూముల కబ్జా సహించేది లేదు

**కఠిన చర్యలు తప్పవు: కలెక్టర్ శశాంక**

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వ భూములు కబ్జా చేసే వారిపై కఠిన చర్యలకు వెనుకాడేది లేదని కలెక్టర్ శశాంక స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, పెండింగ్‌లో ఉన్న 6,7,8 దరఖాస్తులపై తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల పర్యవేక్షణ నిరంతరాయంగా జరగాలని, కబ్జాదారుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని, ఖాళీ ప్రభుత్వ భూములు గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రానున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తుది ఓటరు జాబితా రూపొందించేందుకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాహితీ సుగంధం!

**విభిన్నం, వైవిధ్యం, హైదరాబాద్ సాహిత్యోత్సవం**

- జ్ఞానాన్వేషణకు స్ఫూర్తినిచ్చే ఫుడ్ ఫర్ థాట్
- వైవిధ్యభరితమైన చిత్రకళా ప్రదర్శనలు



సాక్షి, సిటీబ్యూరో: విభిన్న అంశాలపై సమావేశాలు, సదస్సులు.. ఇష్టాగోష్టులు, వైవిధ్యభరితమైన సాంస్కృతిక, చిత్రకళా ప్రదర్శనలు.. స్ఫూర్తినిచ్చే అద్భుతమైన కార్యక్రమాలతో హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ శనివారం రెండోరోజు కనుల పండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల ప్రదర్శనలు సందర్శకులను కట్టిపడేశాయి. ప్రత్యేక ప్రదర్శనలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన చిత్రకళాకారులు అద్భుతమైన చిత్రాలను ప్రదర్శించారు. పిల్లలు, యువతీ యువకుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలకు కూడా అనూహ్యమైన స్పందన లభించింది. వివిధ రంగాలకు చెందిన రచయితలు, ప్రముఖులు, మేధావుల పుస్తకాలను ఈ సందర్భంగా ప్రదర్శనకు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ 14వ ఎడిషన్ ఈసారి హైటెక్ సిటీలోని సత్వ నాలెడ్జ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఒడియా భాషపై, నార్వే సాహిత్యంపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఈ రెండు భాషలకు చెందిన సాహిత్యం, సాంస్కృతిక అంశాలు, కళలపై ప్రత్యేకంగా దృష్టి సారించి కార్యక్రమాలను రూపొందించారు.

**ఆలోచింపజేస్తున్న 'ఫుడ్ ఫర్ థాట్'**

- 'జ్ఞానం కోసం అన్వేషణ' అనే లక్ష్యంతో 8 ఏళ్లుగా పని చేస్తున్న 'ఫుడ్ ఫర్ థాట్' సంస్థ హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నవలలు, కామిక్స్, జనరల్ నాలెడ్జ్, సమకాలీన అంశాలు, కథలు తదితర అంశాలు, విభిన్న భాషల్లో వచ్చిన సాహిత్యాన్ని పిల్లలకు అందజేసే లక్ష్యంతో ఫుడ్ ఫర్ థాట్ సంస్థ దేశవ్యాప్తంగా 600కు పైగా గ్రంథాలయాలను నిర్వహిస్తోంది. ఈ గ్రంథాలయాల్లో 70 శాతం ఇంగ్లిష్ లిటరేచర్ ఉంటే మరో 30 శాతం స్థానిక భాషల సాహిత్యం ఉంటుంది. విద్యార్థుల్లో పుస్తకపఠనం పట్ల అభిరుచిని, ఆసక్తిని పెంచేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేసినట్లు ఫుడ్‌ఫర్ థాట్ వ్యవస్థాపకులు షఫాలీరావు తెలిపారు. ఇప్పటి వరకు 25000 మందికి పైగా పిల్లలకు వివిధ అంశాలపైన సాహిత్యాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.
- 'పిల్లల్లో సృజనాత్మకతను పెంచాల్సిన అవసరం ఉంది. పట్టణ ప్రాంతాల్లో చదువుకుంటున్న వాళ్లకు పుస్తకాలు, లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి. కానీ వారిలో పఠనం పట్ల ఆసక్తి కొరవడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకోవాలనే తపన ఉంది. కానీ ఆ పిల్లలకు పుస్తకాలు అందుబాటులో లేవు. దీన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలకు చెందిన పిల్లలకు ఎక్కువగా అందుబాటులో ఉండేవిధంగా లైబ్రరీలను ఏర్పాటు చేశాం. హైదరాబాద్‌లో కూడా సాధారణ బస్తీల్లో నివసించే చిన్నారుల పుస్తకాల అవసరాన్ని తీర్చేందుకు లైబ్రరీలను ఏర్పాటు చేశాం' అని ఆమె చెప్పారు. ఫిబ్రవరి 10వ తేదీన అర్బన్ రీడింగ్ డెకథ్లాన్ పేరిట బిర్లా ఆడిటోరియంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రీడింగ్ ఛాంపియన్‌లకు బహుమతులను అందజేయనున్నారు.

**భళా.. చిత్రకళ**

హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు వేసిన బొమ్మలు, కళాకృతులతో ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శన కూడా సందర్శకులను ఆకట్టుకుంటోంది. కేరళ, బెంగళూరు, కోల్‌కతా, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన ఆర్టిస్టుల చిత్రాలను ఇక్కడ ఏర్పాటు చేశారు. గొంగడిపై హ్యాండ్ ఎంబ్రాయిడరీ, రాజశేఖర్ అనే ఆర్టిస్ట్ వేసిన జాలరుల జీవన చిత్రం, కేరళకు చెందిన మీర వేసిన ఆఫ్‌సెట్ పెయింటింగ్స్ సందర్శకులను ఆలోచింపజేస్తున్నాయి. మరోవైపు చిన్నారుల కోసం ప్రత్యేకంగా చిత్రకళా శిబిరం ఏర్పాటు చేశారు. యువతీ యువకులు తమ సృజనాత్మకతను ఆవిష్కరించేందుకు ప్రత్యేక శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు.

**ఒడిమా సాహిత్యంపై చెరగని ముద్ర**



తమ రచనలతో సమకాలీన సాహిత్యాన్ని ఎంతో గాఢంగా ప్రభావితం చేసిన కొంతమంది రచయితలు, సాహితీవేత్తలు అనతి కాలంలోనే మరుగున పడిపోయారని ప్రముఖ ఒడియా రచయిత సచ్చిదానంద మొహంతి అన్నారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో ఒడియా సాహిత్యంపై చెరగని ముద్ర వేసిన ఒకప్పటి ప్రముఖ రచయితలు సరళాదేవి, గోపీనాథ్ మొహంతీలపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. అనంతరం గోపీనాథ్ మొహంతి సాహిత్యంపై సుదేష్ణ ప్రసంగించారు.

**ఆటిజం ఒక ఆర్ట్...**

ఆటిజంపై ఏర్పాటు చేసిన సెషన్‌లో ఇద్దరు రచయితలు తమ అనుభవాలను వివరించారు. బుద్ధిమాంద్యులైన పిల్లల నుంచి తల్లిదండ్రులు, సమాజం నేర్చుకోవాల్సిన అంశాలు అనేకం ఉంటాయని వారు అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీకి చెందిన రచయిత దేబాశిష్ పాల్ బుద్ధి మాంద్యుడైన తన కుమారుడు టెన్నిస్ క్రీడాకారుడిగా ఎదిగిన తీరుపై ఆయన తన అనుభవాలను పంచుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన నీనారావు తాను రాసిన మైండ్స్ కేప్స్ పుస్తకం గురించి వివరించారు. ఇద్దరు రచయితలు బుద్ధిమాంద్యులైన తమ పిల్లల నుంచి తాము నేర్చుకున్న అనేక విషయాలను వివరించారు. ప్రముఖ రచయిత జావేద్ అక్తర్ రాసిన 'టాకింగ్ లైఫ్'పై నస్రీన్ మున్నీ కబీర్ మాట్లాడారు.'మై సిటీస్ వేస్ట్ వేర్ డజ్ ఇట్ గో' అనే అంశంపై కల్పన శర్మ, పింకీ చంద్రన్ మాట్లాడారు. ఇంటర్ డిసిప్లినరీ క్లైమెట్ ఎడ్యుకేషన్ పై రాహుల్ చోప్రా ప్రసంగించారు. సాయంత్రం 'ది ఎండ్‌లెస్ మైండ్' విశేషంగా ఆకట్టుకుంది.

# యువతకు ఉజ్వల భవిష్యత్తు దిశగా సర్కారు

శంషాబాద్: యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించే దిశగా రాష్ట్ర సర్కారు అడుగులు వేస్తోందని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అన్నారు. శుక్రవారం పట్టణానికి విచ్చేసిన ఆయనకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఆనందస్ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సర్కారు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడంతో పాట ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువతను నిరాశలోకి నెట్టిందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రేగుల పాటి రితీష్, జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్, సాయిగౌడ్, ప్రణయ్, మణికంఠ, మహేష్, వర్ధన్, జాషువా, చందు, అజయ్, చందు, వర్ధన్, నిఖిల్, ఇమ్రాన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ వెంకట్



# బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాభివృద్ధి

**ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి**

- సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో సమస్యలకు పరిష్కారం: ఎమ్మెల్యే వీర్లపల్లి

కేశంపేట: బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి సాధించిందని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి కొత్తపేట గ్రామ పంచాయతీ భవనం, గౌడ సంఘం భవనం, సంతాపూర్‌లో అంగన్‌వాడీ భవనం ప్రారంభించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగిందన్నారు.

**గత పాలనలో సర్పంచ్‌లకు ఇబ్బందులు**

ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాల అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి నిరంతరం శ్రమిస్తున్నారు. గత ప్రభుత్వం పాలనలో సర్పంచ్‌లకు నిధులు మంజూరు చేయకపోవడంతో సొంత ఖర్చులతో పనిచేసి ఇబ్బంది పడ్డారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సైతం బిల్లులు మంజూరు చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట, సంతాపూర్ సర్పంచ్‌లు నవీన్‌కుమార్, అంజయ్య, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాలరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, అల్వాల, కొత్తపేట ఎంపీటీసీ సభ్యులు సురేష్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, శ్రీధర్‌రెడ్డి, సుందరయ్య, ఆనంద్‌కుమార్, వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేట గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# పల్లెల ప్రగతికి ప్రత్యేక నిధులు

- మూడు రోజుల్లో నీటి ఎద్దడికి పరిష్కారం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: పల్లెల ప్రగతికి అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని నాగన్‌పల్లిలో రూ.10.50లక్షల నిధులతో సీసీ రోడ్డు, యూజీడీ పనులకు, పొల్కంపల్లిలో రూ.20లక్షలతో సీసీ రోడ్డు పనులకు, దండుమైలారంలో రూ.5లక్షలతో సీసీ పనులకు, ముకునూర్‌లో రూ.9లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ముఖ్యమంత్రి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానన్నారు. దండుమైలారం గ్రామంలో నీటి ఎద్దడి తీర్చాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. మూడు రోజుల్లో నీటి ఎద్దడి సమస్య పరిష్కారం అవుతుందని గ్రామస్తులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, జెడ్పీటీసీ సభ్యుడు భూపతిగళ్ల మహిపాల్, సర్పంచ్‌లు మల్లీశ్వరి, జ్యోతి, ఆండాలు, జగన్, ఎంపీటీసీ సభ్యులు సీహెచ్ మంగర, అనసూయ, అరుణ, జి. జ్యోతి, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, మండల ఏఈ ఇంద్రసేనారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సీతయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.


దండుమైలారంలో సీసీ రోడ్డు పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

# ప్లాస్టిక్ వినియోగంతో కాలుష్యం

**స్యాడ్ డైరెక్టర్ రాబర్ట్**

షాద్‌నగర్‌రూరల్: ప్లాస్టిక్ వినియోగంతో కలుషితమవుతున్న పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సోషల్ యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ (స్యాడ్) డైరెక్టర్ రాబర్ట్ అన్నారు. స్యాడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాబర్ట్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగంతో జీవకోటి ప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. మనం ఉపయోగించిన ప్లాస్టిక్ బ్యాగులు, కవర్లు పారవేస్తుండటంతో అవి భూమిలో కలిసి పోయేందుకు కొన్ని వేల సంవత్సరాలు పడుతుందని అన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో వాతావరణం కాలుష్యంగా మారుతుందని అన్నారు. పర్యావరణం కలుషితం కావడంతో ప్రజలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడతారని అన్నారు. ప్రస్తుత సమాజంలో ప్లాస్టిక్ వాడకం అధికంగా ఉందని, ప్లాస్టిక్‌ను నిర్మూలనలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్‌ను నివారించేందుకు ప్రతీ విద్యార్థి ప్రతిన భూనాలన్నారు. ప్లాస్టిక్ బ్యాగులకు బదులుగా తేలికగా భూమిలో కలిసిపోయే కాటన్ బ్యాగులను వినియోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కురిషియా, సనా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న రాబర్ట్

# శాస్త్రీయ దృక్పథం అవసరం

**జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి**

షాద్‌నగర్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక(జేవీవీ) జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఠాగూర్ పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముఖి టాలెంట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ... టాలెంట్ టెస్టులు విద్యార్థుల మేధస్సును పెంపొందిస్తాయన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు, పరిశీలన, ఆసక్తిని రేకెత్తించడానికి సైన్స్ టాలెంట్ టెస్టులు దోహదపడుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రవి ప్రకాశ్‌హర్మాళ్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న నాయకులు

# హత్యాయత్నం కేసులో ముగ్గురికి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

పహాడీషరీఫ్: వ్యక్తిని హత్య చేసేందుకు యత్నించిన ఘటనలో ముగ్గురు నిందితులను బాలాపూర్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డితో కలిసి ఏసీపీ శ్రీనివాస్ కేసు వివరాలను వెల్లడించారు. షాహీన్‌నగర్ బిస్మిల్లా కాలనీకి చెందిన మెహతాబుద్దీన్(32) వృత్తిరీత్యా ఆటోడ్రైవర్. దురలవాట్లకు బానిసైన మెహతాబుద్దీన్ బార్కాస్‌కు చెందిన ఖదీర్ బారక్ బా(36) తండ్రి అలీ బారక బాతో కలసి గంజాయి సేవించేవాడు. ఈ క్రమంలోనే తరచూ గంజాయి ఇవ్వాలని, లేదంటే డబ్బులైనా ఇవ్వాలని వేధించేవాడు. విషయం తెలుసుకున్న ఖదీర్ నేర చరిత్ర కలిగిన తన స్నేహితులు షాహీన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఖాలీద్ దయానీ(20), షేక్ మహ్మద్(31), షారూక్(31)లను ప్రోత్సహించి, ఈ నెల 26న సాయంత్రం షాహీన్‌నగర్‌లో ఉన్న మెహతాబ్‌పై ఏకకాలంలో కత్తులు, ఇనుప రాడ్లతో దాడి చేసి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లి.. నిందితులను రిమాండ్‌కు తరలించారు. షారూక్ పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

## జాగ్రత్తగా వాహనాలు నడపండి

- జీవితాలను ఆగం చేసుకోకండి
- పద్మశ్రీ అవార్డు గ్రహీత మొగిలయ్య

ఇబ్రహీంపట్నం: చేతులెత్తి దండం పెడుతున్నా.. ఇష్టానుసారంగా వాహనాలు నడిపి జీవితాలను ఆగం చేసుకోవద్దని పద్మశ్రీ అవార్డు గ్రహీత మొగిలయ్య విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మొగిలయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి ప్రాణం ఆ కుటుంబానికి ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. వాహనాలు అజాగ్రత్తగా నడపడం ద్వారా అనేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాలు నడిపేటప్పుడు కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని, ప్రతి వాహనదారుడు లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనచోదకుడు తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ వెంకటయ్య, ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.